www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5
వైఎస్ఆర్



వైభవంగా గిరి ప్రదక్షిణ

వల్లూరు : ఏరువాక పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి మహాక్షేత్రంలో తలపెట్టిన గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేన నిర్వాహకులు, ఇంటెక్ లైఫ్ టైం మెంబర్ సట్టి భారవి పేర్కొన్నారు. ఆదివారం పుష్పగిరి దేవస్థానంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భక్తులు అత్యధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొని గిరి ప్రదక్షిణను విజయవంతం చేశారన్నారు .జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని తమ మొక్కుబడులను స్వామివారికి సమర్పించుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల నుంచి మరింత విశేష స్పందన ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అల్పాహారం, నీళ్లు,మజ్జిగ అడుగడుగునా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సహకరించిన స్థానికులు సునీల్, విశ్వనాథరెడ్డి, కాల్వ భాస్కర్ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి పాలనలో గ్రామాలు నిర్వీర్యం

పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-చాపాడు/ఖాజీపేట

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ సీమలను పూర్తిగా నిర్వీర్యం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 115 రోజుకు చేరుకుంది. ఆదివారం మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలంలోని భూమాయపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై ఇంజినీర్‌కొట్టాలు, పేరారెడ్డికొట్టాలు, బుడ్డాయపల్లె, ఖాజీపేట, పత్తూరు, దుంపలగట్టు, కొత్తపేట, చెన్నముక్కపల్లె విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, బలిజలు, రైతులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ సొంత ప్రాంతమైన రాయలసీమలో ప్రజలకు గుక్కెడు నీళ్లివ్వలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. గ్రామ పంచాయతీలకు చెందిన రూ.8,660 కోట్లు జగన్ ప్రభుత్వం దొంగిలించడంతో పంచాయితీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధుల్లేవన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తి సిఎం కావడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారిందన్నారు. జగన్ నిర్వాకం కారణంగా రాష్ట్ర రైతులు అప్పుల్లో జాతీయ స్థాయిలో నెం.వన్‌గా నిలిచారన్నారు..టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.70వేలు ఉన్న రైతుల సగటు అప్పు, జగన్ నాలగేళ్ల పాలనలో రూ.2.5 లక్షలకు చేరిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గతంలో మాదిరిగా డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దళారీల బెడదను నివారిస్తామన్నారు. బలిజలు జగన్ చేతిలో బాధితులుగా మారారన్నారు. రాయలసీమలో బలిజల్ని ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని తెలిపారు. తన పిల్లలు విదేశాల్లో చదివితే చాలు పేద విద్యార్థులు విదేశాల్లో చదవకూడదనే ఆలోచనలో విదేశీ విద్య పథకం రద్దు చేశారని విమర్శించారు. గతంలో కాపులకు అమలు చేసిన రిజర్వేషన్ కి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంటు నుండి 12 సార్లు బలిజ వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే, జగన్ రాజంపేట ఎంపీ సీటును మిథున్‌రెడ్డికి కట్టబెట్టి బలిజలను వంచించారన్నారు. తిరుపతి అసెంబ్లీ సీటును తెలుగుదేశం పార్టీ బలిజలకు కేటాయిస్తే, జగన్ సొంత వర్గానికి కట్టబెట్టాడన్నారని తెలిపారు. బజ వర్గానికి చెందిన సి.రామచంద్రయ్య, సుపులేటి బ్రహ్మయ్య, చదలవాడ కృష్ణమూర్తి, బి.కె.సత్యప్రభ, ఆమె భర్త ఆదికేశవులు నాయుడులకు పలు రాజకీయ అవకాశాలు కల్పించామన్నారు. విద్యా, ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ మేరకు 5శాతం రిజర్వేషన్లు ఇచ్చామన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3100 కోట్లు ఖర్చు చేశామని, ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా 4,528 మంది కాపు విద్యార్థుల్ని విదేశాల్లో చదివించామని గుర్తు చేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా 66.50 కోట్లు రుణాలుగా ఇచ్చామని, 33,594 మందికి నైపుణ్యాభివద్ధి శిక్షణ ఇచ్చామన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవిని కాపులకిచ్చామని, ప్రతి జిల్లాలో రూ.5 కోట్లతో కాపు భవన్‌లను నిర్మించామని తెలిపారు. జగన్ కాపు కార్పొరేషన్ నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి రుణం ఇవ్వకుండా కాపులను ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీశాడన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో అమలు చేసిన విదేశీ విద్య పథకం, నిరుద్యోగ భృతి మళ్లీ ప్రారంభిస్తామని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించామన్నారు. మీ-సేవ నిర్వాహకుల ఇబ్బందులను గమనించి గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో స్థలాలు ఇచ్చి, కమీషన్ కూడా పెంచామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ-సేవ కేంద్రాల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మీ-సేవ కేంద్రాల ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లను అధికారికంగా గుర్తిస్తామన్నారు. ప్రజలపై పన్నుల బాదుడుపై ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనపై లేదన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా పాడైపోయిన రోడ్లపై తట్టమట్టిపోసే దిక్కులేదని తెలిపారు. వైసిపి నేతలు శ్మశానాలను సైతం వదలకుండా ఆక్రమించడం దారుణమన్నారు. పాదయాత్రలో కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు హరిప్రసాద్, ధనపాల జగన్, బిఎన్ శ్రీనివాసులు, దాసరి బాబు, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, శ్రీరాముల యాదవ్, నరసింహులు యాదవ్, కొంగాని వెంకటసుబ్బయ్య, జెండాల మహబూబ్ బాషా, కమలాపురం ఫరూక్, కమలాపురం గౌస్, శంకర్ నాయుడు, టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


ఖాజీపేటలో ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న నారా లోకేష్

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు

- కడపకు చేరుకున్న జీపు జాతా

ప్రజాశక్తి- కడప అర్బన్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 31న హిందూపురంలో ప్రారంభమైన జీపు జాతా కడపకు చేరింది. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో ముత్యాలరావు ప్రసంగించారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్‌హన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం ఇస్తామని వైసిపి మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందన్నారు. 98 శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న నాయకులు, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని వాపోయారు.. వెంటనే కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల కార్మికుల పరిస్థితి పెనంలో నుంచి పోయిలో పడ్డ చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులు కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేవారని, ప్రస్తుతం లేకుండా పోయిందని పేర్కొన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ. 18 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో పనిచేసిన అదనపు కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని చెప్పారు. ఐక్యంగా ఉంటూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. వైసిపి, టిడిపి పార్లమెంటులో బిల్లుకు మద్దతు ఇవ్వడం దుర్మార్గమన్నారు. జిఎస్‌టి వస్తే ధరలు తగ్గుతాయని చెప్పిన కేంద్రం విపరీతంగా పెంచేసిందని పేర్కొన్నారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్న జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాలయిన చేయలేదని చెప్పారు. మున్సిపల్ కార్మికుల పట్ల టిడిపి తన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న జీపు జాతా ముగింపు సందర్భంగా భవిష్యత్తు ప్రణాళికల రూపొందించుకుంటామని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన ఏరు దాటేవరకు ఏటి మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందాగా మారిందని విమర్శించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, నగర అధ్యక్షులు సుంకర రవి, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, కోశాధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ హామీల అమలు కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర నాయకత్వం జీపు జాతా ప్రారంభించిందని చెప్పారు. ఎన్నికల ముందు అయినా ప్రభుత్వం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. రాష్ట్ర నాయకులకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగేంద్రబాబు, కమిటీ సభ్యులు ఏటీఎం నాగరాజు, నారాయణ, గోపి, ప్రజానాట్య మండలి కళాకారులు శ్రీనివాసులు, రామాంజి, కృష్ణవేణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, జిల్లా అధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నాయకులు భైరవ ప్రసాద్, ఆనందరావు, ఓబులేసు, బ్రహ్మానందరెడ్డి, అంజనీదేవి, ఆదామ్, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు

పాఠశాలలను సీజ్ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యం ఫీజుల దోపిడీని అరికట్టాలని, జీవో నంబర్ 1,42ను అమలు చేయని పాఠశాలలను సీజ్ చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సురేష్, కార్యదర్శి కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆదివారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు డిసెంబర్ నుంచే పిఆర్‌ఒలను పెట్టి అక్రమ అడ్మిషన్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అంతా ఆయా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని, బయట కొనుగోలు చేసిన పుస్తకాలు తమ పాఠశాలలో ఉపయోగపడవని చెప్పి రూ.5 వేల నుంచి 8 వేలకు పైగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్, అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రయివేట్, కార్పొరేటు విద్యాసంస్థల 25 శాతం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్ర వ్యవస్థను వీడి ప్రభుత్వ నిబంధనలను అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఉదయ్, సునీల్ పాల్గొన్నారు.

దాడులు చేస్తున్నా పట్టించుకోరా

ప్రజాశక్తి- కడప అర్బన్

కమలాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో నిజాయితీగా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలపై వైసిపి నాయకులు తీవ్రస్థాయిలో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడినా తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టించుకోరా అని టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సాయినాథ్ శర్మ సూటిగా ప్రశ్నించారు. టిడిపి కార్యకర్త జనార్దన్ రెడ్డిపై వైసిపి నాయకుల దాడిని నిరసిస్తూ కమలాపురం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సాయినాథ్ శర్మ ఆదివారం గాయత్రి టవర్స్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతున్నప్పటికీ, వైసిపి శ్రేణులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేసి హతమార్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ జిల్లాలో తెలుగుదేశం నాయకుల్లో ఏమాత్రం స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. వైసిపి మూకల దాడిలో జంగంపల్లి టిడిపి కార్యకర్త కల్లూరు జనార్దన్ రెడ్డి గాయాలతో ఆసుపత్రి పాలైతే పరామర్శించే నాయకులే లేరన్నారు. తమ ఆవేదనను లోకేష్ దృష్టికి తీసుకెళ్లడానికే ర్యాలీ నిర్వహించామని చెప్పారు. ముందుగా దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్దన్ రెడ్డిని సాయినాథ్ శర్మ పరామర్శించారు.

ప్రమాద ఘంటికలు

యమపాశాలుగా విద్యుత్ వైర్లు

కూలుతోన్న విద్యుత్ స్తంభాలు

వర్షాకాలం వచ్చిందంటే ప్రమాదాలే..

కాలం చెల్లిన తీగలతో ప్రజల్లో భయాందోళన


మృత్యువాత పడుతున్న మూగజీవాలు

పట్టని అధికారులు

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన విద్యుత్ తీగలు కాలనాగులై కాటేస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామాలలో కాలం చెల్లిన విద్యుత్ తీగలు ఎప్పుడు తెగి పడతాయో, విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. బతుకుని ాగులో రైతన్నకు అండగా నిలుస్తున్న మూగజీవాలు సైతం విద్యుదాఘాతానికి మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కాలం నాటి స్తంభాలు, వైర్లు శిథిలమై జనానికి కొరకరాని కొయ్యగా మారుతున్నాయి. ఇదిలావుంటే వేలాది రూపాయల్లో జీతాలు తీసుకుంటున్న కొంతమంది విద్యుత్ ఉద్యోగులు వారు చేయాల్సిన పనిని బయటి వారికి అప్పగిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వచ్చిరాని పనితనంతో విద్యుత్ మరమ్మతులు చేస్తూ కొంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామాల్లో సుమారు 40 ఏళ్ల కిందట వేసిన విద్యుత్ వైర్లు, స్తంభాలు శిథిలమై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ ఏర్పాటు చేయక పోవడం, ఎ-బీ స్విచ్‌లు అమర్చకపోవడం, విద్యుత్ లైన్ కింద పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించక పోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాన్స్‌కోకు చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు తాము చేయాల్సిన పనులను బయటివారికి అప్పగిస్తున్నారు. పదో పరకో చేతపెట్టి యువకులతో విద్యుత్ పనులు చేయిస్తున్నారు. దీంతో అనుభవం లేని యువకులు విద్యుదాఘాటానికి బలవుతున్నారు. మండలంలోని రామేశ్వర గ్రామంలో ఉండే విద్యుత్ వైర్లకు, స్తంభాలకు కాలం చెల్లింది. గత సోమవారం రాత్రి బలమైన గాలులకు, విద్యుత్ వైర్లు స్తంభాలు కూలిపోయాయి. తెగిపోయిన వైర్లని నామమాత్రంగా చుట్టి మరమ్మతులు చేపడుతున్నారు. కాలం చెల్లిన వైర్లు తిరిగి ఎప్పుడు తెగిపోతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి నాణ్యమైన విద్యుత్ వైర్లను అమర్చాలని కోరుకుంటున్నారు.


శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం


కాలం చెల్లిన విద్యుత్‌వైరు

స్తంభాలను మార్చాలి



గ్రామంలో కాలం చెల్లిన వైర్లను, విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలి. నిరం తరం వీధుల్లో చిన్నారులు, వృద్ధులు తిరుగుతు న్నారు. చిన్నపాటి గాలికే విద్యుత్ వైర్లు తెగి ఇంటిముందు పడుతున్నాయి. వైర్లు తెగి ఎక్కడ మాపై పడుతాయోనని ఆందోళన చెందుతున్నాం. వెంటనే విద్యుత్ వైర్లను మార్చాలి.

- గాదం వెంకటయ్య, రామేశ్వరం .

కాలం చెల్లిన వైర్లను తొలగించాలి



గ్రామంలో కాలం చెల్లిన వైర్లను తొలగించాలి. విద్యుత్ వైర్లు తెగి మా ఇంటిపై పడ్డాయి. తెగిన సమయంలో ఇంటి ముందు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను మార్చాలి.

-చలం రమణయ్య, రామేశ్వరం.

పీడితుల పక్షపాతి కేతు విశ్వనాథరెడ్డి

అరసం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఈశ్వరరెడ్డి

ఆచార్య కేతుకు ఘననివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

పీడితుల పక్షాన తన కలాన్ని ఝళిపించిన మానవతావాది, అభ్యుదయ భావాలతో సాహిత్యాన్ని సామాజిక శాస్త్రాలతో అధ్యయనం చేసిన గొప్ప కథారచయిత, విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కడపజిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి అన్నారు. కేతు విశ్వనాథ రెడ్డి సంస్మరణ సభను అరసం కడపజిల్లా శాఖ, వైవీయూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా ఆదివారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించాయి. తొలుత వక్తలు, సాహితీవేత్తలు కేతు విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరసం కడపజిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య ఈశ్వర రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన చుట్టూ ఉన్న సమస్యలను, పుట్టి పెరిగిన ప్రాంత జీవితాన్ని కథలుగా మలచిన విశిష్ట రచయితని కీర్తించారు. ఆచార్య కేతు కథలను రేపటి తరానికి అందించి చదివించగలిగితే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, అదే మనం ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. వైవియూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ఆచార్య కేతుకు విశ్వవిద్యాలయం ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ తెలుగు శాఖకు మార్గదర్శనం చెయ్యడమే కాక గజ్జెల మల్లారెడ్డి అవార్డు ఎంపికలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలసంఘం గౌరవాధ్యక్షురాలు పి.సంజీవమ్మ మాట్లాడుతూ తనకు ఆచార్య కేతుతో తనకు 1973 నుంచి పరిచయం ఉందని, 1974లో అరసం మొదటి కథాసంపుటాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆయనను రాయలసీమకో, రాష్ట్రానికో పరిమితం చెయ్యకూడదని, ఆయన రచనలు అనేక జాతీయ భాషల్లోకి అనువదితమయ్యాయని చెప్పారు. సిపిఐ . రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని, మార్క్సిస్టు తాత్వికతను ఆయన ఒంటపట్టించుకొన్నారని తెలిపారు. ఆయన మనసుంచి దూరం కావడం దిగ్భ్రాంతికరమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అరసం ప్రతి ఏటా ఆయన పేరుతో సదస్సులునిర్వహించి అవార్డులు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ కెస్కో సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, ప్రముఖ కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ చీఫ్ ప్యాట్రన్ లయన్ పోతుల వెంకట్రామి రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య ఈశ్వరరెడ్డి

రక్తదాన కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని పెట్రోలు బంకుల వద్ద వాహనదారులకు రక్తదాన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈనెల ప్రపంచ రక్తదాత దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌సి సీనియర్ కరీముల్లా, సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - కడప


బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పించలేని బిజెపి సర్కార్ వెంటనే దిగి పోవాలని అన్నారు. దేశం కోసం నిరంతరం మహిళా రెజర్లు కష్ట పడి , భారత దేశం కోసం ఎన్నో పతకాలు సాధించిన మహిళా రెజర్లు పైన బ్రీజ్ భూషణ్ లైంగికంగా వేధిస్తున్నారని ఆందోళన చేస్తుంటే మోడీ ప్రభుత్వం కనీసం సిగ్గు లేకుండా చూసి చూడనట్టు ఉండటం దారుణం అని అన్నారు. కోరికలు తీర్చమని , అసభ్యకరంగా, శారీరకంగా , మానసికంగా వేధిస్తున్నాడని రెజ్లర్లు పేర్కొంటున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా బిజెపి సర్కార్ కళ్ళు తెరచి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం : ఇబ్రహీం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ఆదివారం విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు రోజు వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఒంటిమిట్ట రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని టిటిడి అధికారులు వేద పండితులు ఘనంగా నిర్వహించారు కార్యక్రమాన్ని శాస్త్రోయుక్తంగా వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూలమాలలు, పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించారు. కన్నుల పండువగా నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు తిలకించి స్వామి అమ్మవార్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ పౌర్ణమి సంవత్సరానికి ఒకసారి వస్తుందని, ఏరువాక పౌర్ణమి నుంచే రైతులు పొలాలను సాగు చేసి పొలాలలో పంటలు వేస్తారని ఆయన తెలియజేశారు. వారందరికీ ధనధాన్య ప్రాప్తి, సుఖ సౌకర్యాలు కలగాలని స్వామి వారు దీవిస్తారని ఆయన అన్నారు. పౌర్ణమి కల్యాణంతో స్వామి వారు పరిపూర్ణులై భక్తులను ధనధాన్య ప్రాప్తి, సుఖసంతోషాలుగా ఉండేటట్లు దీవిస్తారనివేద పండితులు చెప్పారు.

ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన సిఎం : టిడిపి

కడప అర్బన్ : 17 నెలలు జైలు శిక్ష అనుభవించి నేరస్థుడుగా, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కొనసాగుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిన స్థితికి దిగజార్చారని వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బాలదాసు విమర్శించారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు యువగళం పేరుతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని పేర్కొన్నారు. ప్రజా వెల్లువలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పతనం కాక తప్పదని హెచ్చరించారు. 7న లోకేష్ పాదయాత్ర పార్టీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు విరివిగా పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేశ్ యాదవ్, 11వ డివిజన్ ఇన్‌ఛార్జి డేరంగుల శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలదాసు



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వినోద్ కుమార్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి నియోజక వర్గంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డిఎస్‌పి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన వివరాలను సిఐ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. అలాంటి వాటిపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చిన్న చిన్న సమస్యలకు ఘర్షణలు పడరాదని కోరారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో నిరంతరం నిఘా పెట్టినట్లు చెప్పారు. నాటుసారా, మట్కా, జూదం లాంటి చట్ట వ్యతిరేక పనులకు ప్రజలు దూరంగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. అంతకు ముందు మండలంలోని టి. వెలమవారిపల్లె గ్రామంలో కార్డన్ సెర్చ్ చేపట్టి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి

వృద్ధులకు సేవ అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

అనాథ వృద్ధులకు సేవా చేయడం ప్రతి ఒక్కరూ భాగ్యంగా భావించాలని పులివెందుల డిఎస్‌పి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి 26 వసంతాలు కావడంతో వృద్ధాశ్రమంలో టెంకాయ మొక్కలను పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, మానవతా చైర్మన్ చక్రపాణిరెడ్డి, సిఐ వెంకటేశ్వర్లతో కలిసి డిఎస్‌పి నాటారు. అలాగే వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ వృద్ధులకు దుస్తులు, పండ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య 26 సంవత్సరాలు నుండి అనాథ ఆశ్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. పేద వృద్ధులను అక్కున చేర్చుకొని వారి బాగోగులు చూడడం సంతోషకరమని చెప్పారు. ఇలాంటి ఆశ్రమాలు ఉండడం వల్ల అనాథ వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనాథ ఆశ్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని కోరారు. సేవా భావం అనేది ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, మానవత సేవా సంస్థ సభ్యులు శ్రావణ్ కుమార్, శశి కళ, గోపినాథ్, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, బాలం సుబ్బరాయుడు, అమర్, నాగార్జున, రవి, బద్రి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మేజిక్ షో

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా పిల్లలకు ఆదివారం మేజిక్ షో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 45 మంది పిల్లలు పాల్గొన్నట్లు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమం చూసిన చిన్నారులు ఆనందోత్సహంతో చప్పట్లు కొడుతూ మేజిషియన్‌ను అభినందించారు.

హుస్సేన్‌బాషాకు డాక్టరేట్

ప్రజాశక్తి -పులివెందులరూరల్



జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల హ్యుమానిటీస్ డిపార్ట్‌మెంట్‌లో సేవలు అందిస్తున్న డాక్టర్ ఎస్ హుస్సేన్‌బాషాకు ప్రఖ్యాత నెవర్ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్ విభాగంలో పిహెచ్‌డి డిగ్రీ పట్టా అవార్డు సాధించారు. దేశంలో ప్రముఖ ఆరోగ్య రంగా విభాగాలపై 'వర్కింగ్ క్యాపిటల్ సామర్థ్యం'అనే అంశంపై ఆయన పరిశోధన కొనసాగించారు. డాక్టర్ సిహెచ్ అగర్వాల్, డి. వి రేఖా శర్మ పర్యవేక్షణలో ఈ పరిశోధన చేశారు. రోజురోజుకూ మారుతున్న అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా దేశంలోని ఆస్పత్రి రంగంలో గణనీయమైన పెట్టుబడి ,వ్యయం ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని ఈ పరిశోధనలో తేలిందన్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక డిగ్రీ అవార్డు అయినందుకు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జెఎన్‌టియు ప్రిన్సిపల్ డిఆర్‌వి వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణా రెడ్డి , హెచ్‌ఒడి డాక్టర్. ఎం. సాంబయ్య , ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

క్రైమ్ కార్నర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి షరీఫ్

హత్య కేసులో ఏడుగురు నిందితులు అరెస్టు

24 గంటల్లో ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటి పల్లె వంక వద్ద హత్య చేసి మృతదేహాన్ని కాల్చిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారని కడప డిఎస్‌పి షరీఫ్ తెలిపారు. ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బుల లావాదేవీలే హత్యకు కారణమని పేర్కొన్నారు. నిందితుల్లో ఇద్దరు మహిళలున్నారని చెప్పారు. నేర సమయంలో ఉపయోగించిన 03 మోటార్ సైకిళ్లు, 7 సెల్ ఫోన్లు, 2 కట్టెలు, క్రికెట్ బ్యాట్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల్లో అండ్లూరూ చైతన్య కుమార్ రెడ్డి, అవ్వారు శ్రీలీల, మద్దాల చాముండేశ్వరి, సోమ శివ ప్రశాంత్ యాదవ్, జకట ఉదయ్ కిరణ్, సింగనమల వెంకట సాయి, కాకి మోహన్ చంద్ర ఉన్నారని చెప్పారు. అనంతరం కేసును ఛేదించిన చింతకొమ్మదిన్నె సిఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ అరుణ్ రెడ్డి, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడేనా?

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

అధికారులపై దాడులకు బరితెగిస్తున్న ఇసుక మాఫియా

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెన్నా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. రాత్రి సమయాల్లో తిప్పిరెడ్డిపల్లె, రాజుపాలెం గ్రామాల నుంచి ఇసుకను కొంతమంది తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లుగా ఇసుక సరఫరా విధానంలో సమూల మార్పులు వచ్చాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్దేశించిన ప్రాంతాలలో మాత్రమే ఇసుక క్వారీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో మండల పరిధిలోని వెదురూరు, తిప్పి రెడ్డి పల్లె, వద్ద ఇసుక క్వారీ అందుబాటులో ఉంచారు. తరువాత దీన్ని పలు కారణాలతో మూత వేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ నిభంధనల ప్రకారం మీసేవ కేంద్రాలలో ఇసుక కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే ఇతర ప్రాంతాలలోని క్వారీల నుంచి సరఫరా చేశారు. ఆ తరువాత కొన్ని నెలల నుంచి నూతన ఏజెన్సీల ద్వారా ఇచ్చేవారు. చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, వైఎస్ఆర్ గృహ నిర్మాణాలకు ఉచితంగా సరఫరా చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏజెన్సీకి కేటాయించిన సమయం ముగియడంతో రవాణా ఆగింది. కొందరు ఇదే అదునుగా భావించి మండల పరిధిలోని పెన్నా నది నుంచి రాత్రి సమయాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. మండల పరిధిలో రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా సంబంధితాధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా మాముళ్ళ మత్తులో వదిలేస్తున్నట్లు సమాచారం. అడపాదడపా తనిఖీలు చేస్తూ ఉన్నతాధికారులకు అనుమానాలు రాకుండా జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది. పెన్నా తీర గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అక్రమంగా ఇసుకను తరలిస్తే రూ.లక్ష జరిమానా, క్రిమినల్ కేసులు నమోదు వంటి కఠిన చర్యలు అమలులో



అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

ఉన్నప్పటికీ స్థానికంగా అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది యధేచ్చగా ఇసుక తరలింపు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇసుక తరలింపు అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. ఇసుకను అక్రమంగా తరలించే సమయంలో అప్పుడప్పుడూ సిబ్బంది దాడులు చేపడితే వారిపై ఇసుక మాఫియా దాడులకు వెనకాడటం లేదు. అందుకు నిదర్శనం ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పై ఆదివారం జరిగిన సంఘటన నిదర్శనం. పోలీస్ సిబ్బందిపై దాడికి యత్నించిన అనంతపురం పోలీసులు చురుకుగా చర్యలు తీసుకొని కొన్ని గంటల వ్యవధిలో నిందుతున్ని అరెస్టు చేశారు. నిబంధనలు క్రమం తప్పకుండా పాటిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవు. కొంత మంది సిబ్బంది ఇసుక మాఫియాతో చేతులు కలిపి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాపై నిఘా పెంచి కట్టడి చేయాల్సి ఉంది. సొంత శాఖ సిబ్బంది పనితీరుపై కూడా నిఘా ఉంచి ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణం : పిసిసి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న జగనన్న కాలనీని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసే బిల్లులపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 18,186 ఇళ్లు మంజూరు కాగా 3289 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. జిల్లా వ్యాపితంగా 96, 368 మంజూరు కాగా 18.996 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. జగనన్న కాలనీలో దళారుల పాత్ర ఉండడంతో లబ్ధిదారులకు లబోదిబోమంటున్నారని చెప్పారు. దళారులకు ప్రజాప్రతినిధులు సహకారం ఉండడంతో లబ్ధిదారుల నుండి డబ్బులు తీసుకొని ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే యూనిట్ విలువ రూ. 1.80 లక్షలు ఏమాత్రం చాలడం లేదని వాపోయారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే రూ 5 లక్షల నుంచి రూ 7.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఇంటి కోసం అధిక వడ్డీలకు డబ్బులు అప్పులు చేసి ఊబిలో కూరుకుపోయారని చెప్పారు. దళారులు ఇంటి నిర్మాణం చేపడుతామని లబ్ధిదారులను నమ్మించి రూ. లక్షలు తీసుకుని ఇంటి నిర్మాణాలను మధ్యలోనే ఆపి వేయడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి విస్తీర్ణం చాలా అసౌకర్యంగా ఉందని తెలిపారు. ఇళ్లు పిచ్చుక గూళ్ల లాగాఉన్నాయని చెప్పారు. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్నట్లుగా ఉందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంకు ఇచ్చే యూనిట్ కాస్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వానిది రూ 30 వేలు ఉండగా కేంద్ర ప్రభుత్వానిది రూ 1.50 లక్షల అన్నారు. ఇంటి నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ 1.8 లక్షల నుంచి రూ 5 లక్షలు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంటి విస్తీర్ణం 1 సెంటు నుంచి 3 సెంట్లకు పెంచాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. దళారుల చేతుల్లో లబ్ధిదారులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలో నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది .అందులో భాగంగా చాపాడు మండల పరిధిలో సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే జిపిఎస్ విధానంలో సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలో భూసేకరణలో భాగంగా గుర్తులు ఏర్పాటు చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అనంతపురం, బూడిదపాడు, కుచ్చు పాప, అల్లాడుపల్లె, సోమాపురం , పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 350 ఎకరాల వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర,కర్నాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడి కొండ వద్ద హైదరాబాద్ – బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నై కలకత్తా హైవేపైకి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటున్నది. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతుంది. అందుకోసం జిల్లాలో 125 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు 1100 హెక్టార్ల భూములను వినియోగించనుంది. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మన జిల్లా నుంచి సులభంగా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, బద్వేలు



రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా బ్రిడ్జి ఏర్పాటు కోసం ఫిల్టర్ వేసి పరీక్షలు చేపడుతున్న సిబ్బంది

నియోజకవర్గాలు గుండా ఈ రహదారి నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధం చేశారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది మండల పరిధిలో రోడ్డు నిర్మించే ప్రాంతాలలో బ్రిడ్జిల నిర్మాణానికి ఫిల్టర్లు వేసి సర్వే చేస్తున్నారు. వందల ఎకరాల భూములు రోడ్డు నిర్మాణానికి పోతున్నాయని రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మించే ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి వినియోగించే భూముల సర్వే నెంబర్లను విడుదల చేసి రైతుల నుంచి పత్రాలు సేకరించారు.

పాఠ్యాంశాల తొలగింపును విరమించుకోవాలి : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

ఇష్టం వచ్చినట్లు పాఠాలు తొలగించడం విద్యా, పరిశోధన శిక్షణ జాతీయ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) భారతీయ జనతా పార్టీ అనుబంధ సంస్థ కాదని, పాఠాలు తొలగింపును వెంటనే విరమించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతతత్వ నియంతృత్వ బిజెపి విధానాలను అమలు చేసేందుకు విద్యా, పరిశోధన, శిక్షణ జాతీయ మండలి)ఇష్టానుసారంగా పాఠ్యాంశాలు తొలగిస్తుందని చెప్పారు. విద్యార్థులకు సృజనాత్మక శక్తిని పెంపొందించే శాస్త్రీయ విద్యను, లౌకిక ప్రజాస్వామ్య విలువలను నేర్పించాలని పేర్కొన్నారు. మతతత్వ , మత చాందసవాద ఆశాస్త్రీయ భావాజాలం విద్యార్థులకు పాఠశాల దశ నుంచి నూరి పోసేందుకు బిజెపి చేస్తుందన్నారు. ఇది మానవ అభివృద్ధికి అత్యంత ప్రమాదకరం అన్నారు. జీవ పరిణామక్రమ సిద్ధాంతం ప్రపంచమంతా అంగీకరించిన డార్విన్ సిద్ధాంతమని పాఠ్యాంశంలో లేకుండా బిజెపి చేసిందన్నారు. చరిత్రలో ఏం జరిగిందో అదే పాఠ్యాంశాలలో ఉండాలని, చరిత్రలో ఎంతోమంది రాజులు రాజ్యాలు ఏలారని, మొగలాయిల చరిత్ర లేకుండా చేయటం దుర్మార్గమని వాపోయారు. చరిత్రలో మంచి, చెడు రెండు ఉంటాయని ఉన్నది ఉన్నట్టు చెప్పడమే చరిత్ర అన్నారు. ప్రజాస్వామ్యం, పుట్టు పూర్వత్తరాలు , రాజకీయ పార్టీలు వాటి విధివిధానాల పాఠాలను తొలగించడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో పాఠశాల దశ నుంచి విద్యార్థులు ప్రజాస్వామ్యం గురించి దాని విలువల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. రసాయనిక మూలకాల పట్టిక కూడా తొలగించడం అత్యంత దుర్మార్గం అన్నారు. హేతుబద్ధీరణ పేరుతో హేతుబద్ధత లేకుండా చేస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలని శాస్త్ర సాంకేతిక రంగాలు రోజురోజుకూ అభివృద్ధి చెందుతుంటే వాటిని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు ప్రోత్సహించకుండా మతతత్వ పాసిస్ట్ విధానాలను అమలు చేస్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా భౌగోళికంగా ఒక దేశమైనప్పటికీ అనేక సామాజిక సంస్కృతిక భాష వైవిధ్యాలు ఉన్నాయని వాటికి అనుగుణంగా విద్యా విధానం ఉండాలని తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేసి రాష్ట్ర విద్యా విధానాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు సుభాష్, రాఘవ, సతీష్ పాల్గొన్నారు.

లింగమూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప

బిసి ప్రజా చైతన్య సమాఖ్య ప్రొద్దుటూరు అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పూలే సేవా రత్న అవార్డు గ్రహీత అయిన బత్తల లింగమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, అధికారులు, బీసీ సంఘ ప్రతినిధులు కలిసి బత్తల లింగమూర్తి ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారులు సుంకేసుల ఖాదర్ భాష, జిల్లా ఉపాధ్యక్షులు పస్తం అంజి, ఆర్ల గంగయ్య, పాల్గొన్నారు.



బత్తల లింగమూర్తిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, సంఘ ప్రతినిధులు



రైతులతో కలిసి సేద్యం చేస్తున్న భూపేష్ రెడ్డి

ఏరువాక పౌర్ణమి రైతులకు పండుగ

- భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏరువాక పౌర్ణమి రైతులకు పండగ లాంటిదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పొన్నతోటలో ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి అంటే రైతులకు అతి పెద్ద పండుగ అన్నారు. తొలకరి ఆసన్నమయ్యే సమయంలో దున్నడానికి సిద్దంగా ఉన్న పంట పొలాన్ని శుద్ధి చేసుకొని సేద్యం మొదలుపెట్టే ఉత్సవమే ఏరువాక అన్నారు. భూమిని, పశువులను, సేద్యం పనిముట్లను పూజించే పండుగ అన్నారు. ఏరువాక రోజు రైతులందరూ వ్యవసాయ పనులు ప్రారంభిస్తారన్నారు. చంద్రన్న పాలనలో వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు రాష్ట్రంలో జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. రైతు భరోసా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోళ్లు, రైతులకు యంత్రపరికరాలు పంపిణీలో వైఫల్యం చెందారన్నారు. రైతు భరోసాను రైతు దగా చేశారన్నారు. మోటర్లకు మీటర్లు పెడుతూ రైతుల మెడకు ఉరితాడు బిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గంగాధర్, బాలరాజు, శంకర్, ఆంజనేయులు, రమణయ్య, బాలు, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, సంజీవ్, వెంకటేష్, మల్లారెడ్డి, జనార్ధన్, ప్రతాప్, రాజశేఖర్, కొండలరావు, ప్రసాద్, రామాంజి, ప్రసాద్, చంద్ర, బాలవర్ధి, బాల గుర్రప్ప, గుర్రప్ప, పుల్లన్న, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో చిన్నారుల విజ్ఞాన్ని పెంపొందేందుకు పోటీలు నిర్వహించామని చెప్పారు. కథలు రాయడం, చిత్రలేఖనం గీయించడం వంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజగోపురం ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



వై.ఎస్. మనోహర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆర్యవైశ్యులు

పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న వాసవి కాలనీలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి నూతన రాజగోపుర ప్రతిష్టాపన, కుంభాభిషేకానికి హాజరుకావాలని ఆర్యవైశ్య సభ్యులు ఆదివారం మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని వారిని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతగానో అలరించారు. ఆదివారం మిస్పా మూవీ పద్మాకర్ సహకారంతో నగరానికి చెందిన దేవా డ్యాన్స్ అకాడమీ చిన్నారులు సినీ జానపద లంబాడి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ఆదివారం సాయంత్రం సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాష్టర్ రాజా, రాజా కళా నిలయం, పులివెందుల వారి శిష్య బృందంచే జానపద, శాస్త్రీయ, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సునీత రెడ్డి, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్, నృత్య శిక్షకుడు రాజా, పరిపాలనా అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశాలో రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఒడిశాలోని బాలసోర్ సమీపంలో బహనాగ్ బజార్ స్టేషన్ వద్ద కోరమండల్ ఎక్స్ ప్రెస్ గూడ్స్ రైలు ను డీ కొట్టడం, యశ్వంత్ పూర్ సూపర్ పాస్ట్ ఎక్స్ ప్రెస్ కోరమండల్ ఎక్స్ ప్రెస్ భోగిలను ఢీ కొట్టడంతో పెను ప్రమాదం సంభవించిందని, ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పిడిఎస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుర్ఘటనలో 260 మందికి పైగా మరణించడంతో పాటు, 800మందికి పైగా క్షత గాత్రులయ్యారని పేర్కొన్నారు ఇప్పటికే 100కు పైగా రైల్వే స్టేషన్లను, రైల్వే లైన్లను ప్రయివేటీకరించిందని పేర్కొన్నారు. ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వం భాధ్యత వహించాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.50లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పిడియస్ యు అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ క్రైస్తవులకు తక్షణమే క్షమాపణ చెప్పాలి

కడప : ఆదిలాబాద్ ఎంపీ క్రైస్తవులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్, శాంతమ్మ డిమాండ్ చేశారు. సోయం బాబురావు ఎంపీ పదవికి అర్హుడు కాదని వారు అన్నారు. ఆదివారం కృపా కాలనీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు మతాల మధ్య ఘర్షణలు సృష్టించే విధంగా క్రైస్తవులను, పాస్టర్లను భయభ్రాంతులకు గురిచేసి బెదిరించడం దారుణమని వాపోయారు. ప్రజల ఓట్లతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ ఇలాంటి మాటలు మాట్లాడడం సరి కాదని చెప్పారు. ఆయన్ను పదవి తొలగించే వరకు పోరాటం చేయాలన్నారు. సమావేశంలో పి.రవితేజ, ఏ.అగస్టీన్, రోజా, శాంతిరాజు పాల్గొన్నారు.

యువగళం ఆగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి నేతలు చిల్లర రాజకీయాలతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఆగదని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి హెచ్చరించారు. నారా లోకేష్ పాదయాత్ర కడపలో కొనసాగేందుకు అనుమతుల కోసం ఎస్‌పి బంగాళాలో ఆదివారం ఎస్‌పి అన్బురాజన్‌ను టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా హోటల్ హరిత ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 27న చిత్తూరులో ప్రారంభమైన నారా లోకేష్ పాదయాత్ర, అనంత, కర్నూల్‌లలో దిగ్విజయంగా కొనసాగిందన్నారు. సిఎం జగన్ సొంత జిల్లాలో లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రొద్దుటూరులో రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు వేయించి, లోకేష్‌పై కోడుగుడ్డు విసిరారన్నారు. పాదయాత్రకు ఏదో ఒక రకంగా అంతరాయం కలిగించాలన్నదే వారి లక్ష్యమని మండిపడ్డారు. పాదయాత్ర కొనసాగే ప్రాంతానికి ముందుగా పోలీసు అధికారులు అనుమతులు ఇస్తే ఆ ప్రాంతాన్ని పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. అనుమతులు చట్టపరంగా ఇవ్వాలన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యువ గళం పాద యాత్ర నిర్వహిస్తున్న లోకేష్‌కు పోలీసులు గట్టి భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ప్రొద్దుటూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.